బాలం వెంకట్రావు



**సూ**రీడు తూర్పు దిక్కున ఉదయిస్తున్నాడు. పక్షులు కిలకిలరావాలు చేస్తున్నాయి. రైతులు పొలాల వైపు వెళ్తున్నారు. పాడిరైతులు ఫశువుల కొట్టాలకు వెళ్తున్నారు. పంటకాలువలోని నీరు గలగలమని పారుతోంది.

ఊరి పొలిమేరలో వున్న పెదనాయుడు కోళ్ల ఫారంలో 'కిమ్ కిమ్' 'కొక్కక్కొ' మని కోళ్ల శబ్దం. ఆ శబ్దం పెద్దకోళ్లది ఓరకమైన లయ అయితే పిల్లలవి .ఇంకో రకమైన లయ. నరసయ్య, కోటయ్య కోళ్లకి దాణా వేయటంలో నిమగ్నమయ్యారు. నరసయ్య మెదటి అంతస్థులో వున్న గుడ్లు పెట్టే పెద్దకోళ్లకి వేస్తుంటే ఇంకో పక్కనుంచి కోటయ్య కింద వున్న పిల్లలకి వేసుకొస్తున్నాడు. అరగంటలో వాటికి ఆహారం పెట్టటం పూర్తి చేసారు. ఆ రోజు వాటి ఆహారం మొక్కజొన్న. తర్వాత నీళ్లు తెచ్చి నీటి తూము (వాటర్ ఛానల్) లో పోసారు. అవి కావలసినప్పుడు ఆ నీటిని తాగుతాయి. ఉదయం పనిపూర్తిచేసి కాళ్లూ చేతులూ కడుక్కున్నారు. వాళ్లిద్దరూ పెదనాయుడు కోళ్లఫారంలో పనివాళ్లుగా వుంటున్నారు. ఇద్దరికీ నెలకి చెరో పన్నెండు వందలు చొప్పున జీతం. నరసయ్య కోళ్లఫారంలో పనిచేస్తూనే అక్కడికి కొంత దూరంలో వున్న తన సొంత పాడిగేదెను కూడా చూసుకొంటూ వుంటాడు. భార్య రంగమ్మ కూలిపనికి వెళ్తుంది. కోటయ్య మాత్రం ఒంటరివాడు. అతనికి ఎవరూలేరు. యజమాని పెదనాయుడు రోజూ రెండుమూడుసార్లు కోళ్లఫారంకొచ్చి అన్నీ చూసుకొని వెళ్తుంటాడు.

**ఆంధ్రప్రభ ఆదివారం అనుబంధం-**
**ఎ.వి.కె.ఎఫ్. (అమెరికా) కలిసి నిర్వహించిన దీపావళి కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ**

ఉదయం కోళ్లకి దాణా పని పూర్తవగానే కోటయ్య తన మకాంకేసి వెళ్లి పోయాడు. నరసయ్య నోట్లో పందుపుల్ల పెట్టుకొని తన పశువుల పాకవైపు వెళ్లాడు. దూడ అతన్ని చూడగానే 'అంబా' అంటూ అరిచింది. బాల్చీతో నీళ్లు తెచ్చుకుని ముఖం కడుక్కున్నాడు. గేదె నరసయ్య వైపు ఆశగా చూసింది. పాకలోంచి ఉలవలు కలిపిన తవుడు తినసాగింది. దూడను వదిలాడు. కొంతసేపటి తర్వత దాన్ని కట్టేసి పొదుగు నుంచి పాలు పిండాడు. తర్వాత వాటికి గడ్డివేసి పాలచెంబు పట్టుకుని ఇంటికి వెళ్లాడు. ఇది ప్రతిరోజూ సాగే దినచర్య.

ఇంటికి వెళ్లేటప్పటికి నరస్యను చూసి ఆరేళ్ల కొడుకు చేతిలో

రొట్టెముక్కతో ఎదురొచ్చాడు. వాణ్ని దగ్గరకు తీసుకున్నాడు. భార్య రంగమ్మ మినపరొట్టి చేసి వుంచింది. నరసయ్య రొట్టి తిని టీ తాగాడు. రంగమ్మ పాలు చిన్న క్యానులో పోసుకొని రోజూ వతనుగా పోసే ఇళ్లకు వెళ్లింది. నరసయ్య కొడుక్కి లాగుచొక్కా తొడిగి బడికి పంపటానికి తయారు చేసాడు. కాస్సేపు నులకమంచం మీద నడుం వాల్చాడు. ఇంతలో రంగమ్మ తిరిగొచ్చింది.

"ఈ యెండల్లో గుడిసనెయ్యాలి మావా!... వానలొత్తే కుదర్దు" అంది గుర్తు చేస్తూ.

"సరేలేవే. సూద్దాం" అంటూ నరసయ్య తువ్వాలు భుజం మీద వేసుకొని తొమ్మిది గంటలకల్లా కోళ్లఫారం వద్దకు చేరుకున్నాడు. కోటయ్య అప్పటికే వచ్చేసాడు. రోజూ పొద్దున్న తొమ్మిది గంటలకి, పదకొండు గంటలకి మరల సాయంకాలం మూడు గంటలకి కోళ్లు పెట్టిన గుడ్లని సేకరిస్తారు.

గుడ్లసేకరణ పూర్తయ్యేటప్పటికి పెదనాయుడు వచ్చాడు. గుడ్లకొనుగోలు దార్లూ వచ్చారు. కొంతమంది సైకిళ్ల మీద, కొందరు మోటార్ సైకిళ్లమీద. టోకున అమ్మే లెక్కలన్నీ పెదనాయుడు దగ్గరుండి చూసుకున్నాడు. కొనుగోలు దార్లు అందరూ వెళ్లిపోయాక సొమ్ములు లెక్కపెట్టుకుంటూ కూర్చున్నాడు.

"మనం దానా కంపిని పేడు వాడాల్సిందేనండి. తక్కువలో అయిపోద్దని నూకలూ జొన్న పిండీ యెడితే దిగుబడి మరీ తగ్గిపోతాదండి!" అన్నాడు నరసయ్య. ఆ మాటలు చెప్పినవే అయినా మళ్లీ చెప్పాడు.



అతని మాటల్తో పెదనాయుడు చటుక్కున నరసయ్య వంక చూశాడు. కొన్ని క్షణాలు అలా ఆలోచిస్తూ ఉండి పోయాడు. 'వీడు ఎప్పుడూ ఇదేమాట' అనుకున్నాడు మనసులో. తర్వాత నా బాగు కోసమే కదా వీడు చెప్పేది' అనుకున్నాడు మళ్లీ.

"సర్లేరా...రేపు అదే తీసుకుందాం!" అన్నాడు పెదనాయుడు. దాంతో నరసయ్య ముఖం వికసించింది. మళ్లొస్తానని చెప్పి వెళ్లిపోయాడు. పెదనాయుడు.

"ఎలాగైతే వొప్పించావురా" అన్నాడు కోటయ్య మెచ్చుకోలుగా

"మరేంసేత్తాం....కొంచెం దిగుబడి ఎక్కువైతే మనమో పద్రూపాయలు అడగటానికుంటాది" అన్నాడు నరసయ్య.

"తెలివయినవాడివేరా నర్సిగా!" అన్నాడు నరసయ్య!"-సాగదీస్తూ కోటయ్య.

"మరి ఆయన బాగుంటేనే గదా మనం బాగుండేది"- నరసయ్య.

"అవునుసుమా!"- కోటయ్య.

మధ్యాహ్నమయింది. భోజనాల వేళకావటం వలన నరసయ్య తన ఇంటికి వెళ్లగా, కోటయ్య తన బసకి వెళ్లాడు. ఇంట్లో ఒక కునుకు తీసి సాయంత్రం నాలుగ్గంటలవుతుండగా వచ్చాడు నరసయ్య. కాస్త ముందుగా కోటయ్య వచ్చి ఉన్నాడు. గుడ్లు తక్కువ వుండటంవలన సేకరణ త్వరగా పూర్తిచేసి తర్వాత కోళ్లకి దాణా వేయటం కూడా కానిచ్చేసారు. అంతలో పెదనాయుడు వచ్చాడు. కొంతమంది కొనుగోలు దార్లూ వచ్చారు. అమ్మకాలు పూర్తయ్యాయి. చీకటి పడుతూండగా కోటయ్య వెళ్లిపోయాడు. నరసయ్య, పెదనాయుడు మాత్రం ఉన్నారు.

"నర్సిగాం...టైమయింది.ఇంక వైరెయ్యి" అన్నాడు పెదనాయుడు.

నరస్య గెడ, వైరు పట్టుకొని కరెంటు స్తంభం వద్దకు వెళ్లాడు గెడ సహాయంతో రెంటి వైరుల్ని కరెంటు తీగలకి తగిలించాడు. లైట్లు వెలిగాయి. రాత్రిళ్లు లైట్లు పెట్టటం వలన కోళ్లు ఎక్కువ ఆహారం తీసుకుంటాయి. దానివల్ల గుడ్లు బాగా పెడ్తాయి. లైట్లు పెట్టకపోతే తిండి తక్కువ తిని సమయానికి గుడ్లు పెట్టలేవు. ఇంకా ఈ లైట్ల కాంతి అవి ఆహారం తినటానికీ కాక కొద్దిపాటి వేడిని కూడా కలిగిస్తుంది. ఈ నులివెచ్చని వేడి కోడిపిల్లల్ని చలినుంచి కాపాడుతుంది. అందుకే రాత్రి కనీసం తొమ్మిదిన్నర పది గంటల దాక లైట్లు వేసి ఉంచుతారు. అయితే పెదనాయుడు తన కోళ్ల షెడ్డుకి చట్టబద్ధంగా కాకుండా రోజూ సంజెవేళ కొన్ని గంటల పాటు దొంగచాటుగా స్తంభానికి వైర్లు తగిలించి కరెంటు వాడుకోవటం అలవాటు. వేసవి అయితే సాయం కాలం ఆరున్నర, చలికాలమయితే అయిదున్నరకి గెడ, వైరు పట్టుకొని కరెంటు స్తంభం వద్దకెళ్లి కొక్కేలతో వైర్లు వేలాడదీయటం నరసయ్య డ్యూటీ. ఇలా చేయటం వలన పెదనాయుడుకి కొంత సొమ్ము ఆదా అవుతూవుంది.

ఆపూట పెదనాయుడు కొంతసేపు వుండి ఇంటికెళ్లిపోయాడు. నరసయ్య మాత్రం ఇంటికెళ్లి అన్నం తిని, రాత్రి తొమ్మిదిన్నరకి మళ్లీ వచ్చాడు. అప్పటికి అన్ని కోళ్లు సద్దుమణిగాయి. స్తంభం నుంచి వైర్లు తీసేసి రెండులైట్లు మాత్రం వుంచాడు. తర్వాత ఇంటికి చేరుకుని ముసుగుతన్ని నిద్రపోయాడు.

000

పొద్దు పొడవకముందే నరసయ్య కోళ్ల షెడ్డు (కోళ్లఫారం) కి వెళ్లాడు. రోజూ చేసే పనులే -దాణా వేయటం-నీళ్లు పెట్టటం వగయిరా. గుడ్లు సేకరించే సమయానికి ముందుగానే పెదనాయుడు వచ్చాడు సరికొత్త దాణా- మిల్లర్ మిక్చర్ బస్తాతో. నరసయ్య సంతోషపడిపోయాడు. తన మాటకు విలువిచ్చినందుకు. ఆవేళ సాయంత్రం నాలుగు గంటలకి కొత్త దాణాన్ని కోళ్లకి రుచి చూపించాడు నరసయ్య. అవి ఆత్రంగా తింటూవుంటే గుడ్లప్పగించి అలాగే చూస్తుండి పోయాడు కొంతసేపు. కోటయ్య వంకా చూశాడు గర్వంగా.

కోటయ్య చిర్నవ్వు నవ్వాడు. ఆరోజు అలా జరిగింది.

మరునాడు నరసయ్య కోళ్లఫారంలో పనిపూర్తి చేసుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చాడు. ఆరోజు రంగమ్మ కూలికి వెళ్ల లేదు. నరసయ్య అన్నం తిని నులకమంచంలో కూలబడ్డాడు.

కొంతసేపటికి ఆకాశంలో మార్పు వచ్చింది. మేఘాలు కమ్ముకొని గాలివాన మొదలైంది. చిన్నగా ఆరంభమయిన వాన కాస్తా పెద్దదైంది. వాతావరణం చల్లబడేటప్పటికి హాయిగా వుంది. గంటలు గడుస్తున్నా వాన తగ్గలేదు. కురుస్తూనే వుంది నరసయ్య బద్దకంగా అలాగే పడుకున్నాడు. రంగమ్మ వేరు శనక్కాయలు వేయించింది. అవి తింటూ ఇద్దరూ ముచ్చట్లు చెప్పుకున్నారు.


"చీకటి పడింది...నువ్వు కోళ్ల సెడ్డుకీ యెల్లలేదు. పాక దగ్గిరకీ యెల్లలేదు మావా!" అంది గురు చేస్తూ.

"వుప్పుడేం మెల్తానులేవే!?...పాక దగ్గిరకి కోటయ్య యెల్తాడ్లే. నే నెల్లనప్పుడు సూసుకోవటం ఆడికలవాటే! అది పాలిచ్చేదీ వంటిపూటే గదా!" అన్నాడు నరసయ్య ధీమాగా.

"నీ యిష్టం" అంది రంగమ్మ ఏమి అనలేక

000

చల్లగా తెల్లారింది. నరసయ్య మంచం మీద నుంచి కంగారుగా లేచాడు. తన యజమాని ఏమనుకొంటున్నాడో అనుకొంటూ ఆగరాబాదరాగా కోళ్ల షెడ్డుకి వెళ్లాడు. అక్కడ అంతా చిందర వందరా వుంది. కోటయ్యతోపాటు పెదనాయుడు కూడా వున్నాడు. రాత్రి వర్షానికి నేలంతా చిత్తడిగా అయింది. కొన్ని సామాన్లు చిందరవందరగా పడివున్నాయి. కోళ్లు అరుస్తున్నాయి. నరసయ్యని చూడగానే పెదనాయుడు మండిపడ్డాడు.



"ఏరా నర్సిగా! రాత్రి ఎక్కడ చచ్చావ్?... రాత్రంగా కరెంటు లేదు. లైట్లు లేవు...నాకు అలవాటు లేక స్తంభం మీద వైరు వేస్తే మొత్తం కరెంటు పోయింది. ఎక్కడో ఫ్యూజు కొట్టేసింది. లైట్లు లేక అంతా అంధకారమైపోయింది. నేను చచ్చాను. నువ్వెళ్లి ఇంట్లో తొంగున్నావ్!" ఆగ్రహంతో ఊగిపోయాడు.

నరసయ్య బిక్కచచ్చిపోయాడు. దెబ్బతో బద్ధకం అంతా ఎగిరిపోయింది. దిక్కులు చూశాడు సమాధానం చెప్పలేక. వాళ్లతోపాటు పని చేయటం ఆరంభించాడు. అలా చేస్తుండగా వున్నట్టుండి అతని మనసు పాకమీదికి మళ్లింది.

'రాత్రి గాలివానకు గేదెలా వుందో! బైట కట్టేసాను. పైగా పాడిగేది' అనుకున్నాడు.

కోళ్లఫారంలో పనిపూర్తవగానే ఆత్రంగా పాకవైపు నడిచాడు పాక అల్లంతదూరాన వుండగానే అక్కడి దృశ్యాన్ని చూసి బెంబేలెత్తిపోయాడు. గేదె నేలమీద పడివుంది! కరెంటువైర్లు కిందపడిస్తంభం నుంచి వేలాడుతున్నాయి. అంబా అంటూ దూడ అరుస్తోంది. ఆందోళనతో క్షణాల్లోనే దగ్గరకు చేరుకున్న నరసయ్య కొయ్యబారిపోయాడు.

'గేది సచ్చిపోయింది! తన పాడిగేదె కరంటు వైర్లు పడి సచ్చిపోయింది!'

"నా గేదీ!...నా బతుకు తెరువు బాబోయ్!" బావురు మన్నాడు. దుఃఖం కట్టలు తెంచుకొంది. తట్టుకోలేక గేదెని తాకబోయాడు. కరెంటు వైర్లు భయపెట్టాయి. వెంటనే చేతులు వెనక్కి తీసుకున్నాడు. దూడని పాకలో కట్టి గడ్డి వేసాడు. బయటికొచ్చాడు. ఇంక నిలబడలేక కోళ్ల షెడ్డుకి పరుగెత్తాడు.

పెదనాయుడు నరసయ్యని ఆశ్చర్యంగా చూశాడు.

'నా పాడిగేది సచ్చిపోయిందయ్యా!...కరంటు వైర్లు పడి సచ్చిపోయింది!" నరసయ్య గొంతు బొంగురు పోయింది.

పెదనాయుడు కొన్ని క్షణాలు అవాక్కయ్యాడు.

"నిన్న గాలివానకి వైర్లు తెగిపడి వుంటాయి...ఏం ఫర్వాలేదు. కరెంటాపీసోళ్లని నష్ట పరిహారం అడగొచ్చులే!... గాభరాపడకు" అన్నాడు ధైర్యం చెబుతూ.

ఆ మాటలకు నరస్యకు కొంత ఊరట కలిగింది. అయినా చక్కగా పాలిచ్చి తనసంసారాన్ని ఆదుకునే పాడి గేదెను పోగొట్టుకున్నాననే బాధ మాత్రం అలాగే వుంది!

'రంగికి ఈ సంగతెలితే యెంత బెంగట్టుకొంటుందో!' అనుకొని ఉసూరుమంటూ ఇంటికెళ్లాడు. అప్పటికీ రంగమ్మకి సంగతి తెలిసి శోకాలు తీస్తోంది.

ఆముదనట్టపు కరంటు తీగలు నోరువాయీ లేని మా గేదిని పొట్ట నొట్టుకున్నాయి దేముడోయ్" ఆమె ఆవేదనని చూసేటప్పటికి నరసయ్యకు వున్న బాధ ఎక్కువైంది. అయినా తమాయించుకున్నాడు.

"కరంటోళ్లు నట్టపరేరం యిత్తారంటలే. వూర్కో" అన్నాడు భార్యని సముదాయిస్తూ. ఇరుగు పొరుగు వాళ్లు వచ్చి సానుభూతి మాటలు మాట్లాడారు. ఆ పూట వాళ్లిద్దరూ అన్నం ముట్టలేదు.

000

ఆ మరునాడు ఉదయం భార్యాభర్తలిద్దరూ పాకవద్ద కెళ్లారు. గేదెను చూసేపట్పటికి వాళ్లకి దుఃఖం పొగుకొచ్చింది. ఇంతకాలం తమకు చన్నీళ్లకు వేన్నీళ్ల సాయంగా వుండి అకస్మాత్తుగా పోయిందనీ, ఇంక గేదెకీ తమకూ ఋణం తీరిపోయిందని బాధ పడ్డాడు. దూడకు నీళ్లు పెట్టి గడ్డి వేసారు. అది బెంగతో నిన్నట్నుంచి తిండి తినటం మానేసింది. తల్లి మృతదేహం వంక చూస్తూ అరుస్తోంది. ఎండెక్కింది. రంగమ్మ ఇంటికెళ్లింది.. నరసయ్య కరెంటు ఆఫీసుకు వెళ్లాడు. అక్కడున్న అధికారికి జరిగిందంతా చెప్పాడు. పరిహారం ఇప్పించమని ప్రాధేయపడ్డాడు.

"మా లైనుమేన్ తనిఖీకి వచ్చాడు. నువ్వు అక్కడే వుండు... నేను గంటలో వస్తాను" అన్నాడు ఆ అధికారి.

నరసయ్య వెంటనే బయల్దేరి పాక వద్దకు చేరుకున్నాడు. అప్పటికే లైన్‌మేన్ వచ్చి కిందపడ్డ తీగల్ని తొలగిస్తున్నాడు. గేదెని చూస్తూ విచారవదనంతో మోకాళ్లమీద అలాగే కూర్చున్నాడు నరసయ్య. పొద్దున్నుంచీ పచ్చిమంచినీళ్లు కూడా తాగలేదు. మధ్యాహ్నం అవుతోందనగా జీపు వచ్చి ఆగింది. అందులోంచి అధికారి దిగాడు. గేదె మృతదేహాన్ని కరెంటు వైర్లు పడివున్న తీరునీ నిశితంగా పరిశీలించాడు. లైనుమేన్ ఏదో వివరించాడు. నరసయ్య ఉత్సుకతతో అధికారి వంక చూశాడు.

"నీకు నష్టపరిహారం వస్తుంది...పంచాయితీ ప్రెసిడెంటు ధ్రువీకరణ పత్రం మీద సంతకం చేసివ్వాలి!" అన్నాడు అధికారి. ఆ మాటలకు నరసయ్యలో కొంత ఉత్సాహం వచ్చింది.

"అలాగేనండి బాబయ్యా!" అన్నాడు చేతులు కట్టుకుని.

"ఈ కాగితాలు తీసుకుని ఆఫీసుకు రా!" అని కాగితాలు నరసయ్య చేతిలో పెట్టి జీపు ఎక్కి వెళ్లిపోయాడు అధికారి. నరసయ్య తువ్వాలు దులిపి భుజం మీద వేసుకున్నాడు. కాగితాలు పట్టుకుని నేరుగా ఊళ్లోని పంచాయితీ ప్రెసిడెంట్ రామనీదు ఇంటికి వెళ్లాడు. అతను అప్పుడే భోజనం చేసి

పడుకుర్చీలో కూర్చున్నాడు.

దండాలండి పెసిడెంటు గారు...! నేను నరసయ్యనండి. నిన్నవానకి కరంటు వైర్లు పడి మా పాడిగేది సచ్చిపోయిందండి!... తవరు సంతకం పెడితే కరంటాపీసోళ్లు నట్టపరేరం ఇత్తామంటున్నారండి. నాలుగేలుయిలువయిన గేదండయ్య!" అన్నాడు కాగితాలు చూపుతూ ఎంతో ఆవేదనగా.


రామినీడు నరసయ్యని పైనించి కిందికి ఎగాదిగా చూశాడు. తర్వాత పేపర్లో తల దూర్చి కొన్ని క్షణాలు మౌనంగా వున్నాడు.

"నువ్వు పెదనాయుడు మనిసివి గదూ...?మరి మీ యజమాన్నే అడగలేక పోయావా? అంత పెద్దమనిసిని దగ్గిరెట్టుకుని నా దగ్గిరకెందుకొచ్చావ్?" అన్నాడు రామినీడు.

"మీరు పెద్దోళ్లు. మీరే అలాగంటే ఎలాగండయ్యా!" అన్నాడు నరసయ్య జాలిగొలిపేలా.

"ఎవరయ్యా పెద్ద? మీ పెదనాయుడా? నేనా? గ్రామంలో నామీదే రాజకీయులు నడిపిస్తాడు మీవాడు. ఆ... అతన్నే అడుక్కో నా దగ్గరకెందుకు కొచ్చావ్?" రామినీడు తీవ్ర స్వరంతో అన్నాడు.

నరసయ్య మ్రాన్పడిపోయాడు. ఏం మాట్లాడాలో ఏమి సమాధానం చెప్పాలో అర్థం కాలేదు.



"పేదాల్లంమేము. అయన్నీ మాకేం తెలుసండి...దయతల్సండి" అన్నాడు బతిమాలుతూ నరసయ్య.

"నేను ఎక్కువ మాట్లాడను. మాటంటే మాటే!" అన్నాడు ఘాటుగా రామినీడు.

నరసయ్య కన్నుల్లో నీళ్లు తిరిగాయి. భారంగా అడుగులేసుకొంటూ రోడ్డు మీద కొచ్చాడు. నేరుగా పెదనాయుడు వద్దకు వెళ్లాడు. సంగతంతా చెప్పి మీరే కాపాడాలన్నాడు.

"ఆడు పెట్టకపోయినా పర్వాలేదు. కరెంటాపీసోళ్లు పరిహారం ఇస్తారు... అడుగు" అన్నాడు పెద నాయుడు డబ్బులు లెక్కపెట్టుకొంటూ. దాంతో నరసయ్య ఉసూరుమంటూ మళ్లీ కరెంటాఫీసుకు వెళ్లాడు. అధికారి, సిబ్బంది ఏవో చర్చింటుచుంటున్నారు. నరసయ్య చేతులు కట్టుకొని నిలబడ్డాడు.

"ఆ పెసిడెంటు గోరు సంతకం యెట్టన్నారండి...నేను పెదనాయుడు గారి మనిసినని ఆయకు మంట...ఆళ్ల రాజకీయాలు ఆళ్లు సూకుకోవాలి గాని మద్దెలో బక్కోళ్లం మమ్మల్నంటే ఏం సేత్తాం సెప్పండి?... నాగేది సచ్చిపోయి నేనేడుత్తుంటే ఆళ్లకేమో రాజకీయాలు!" అన్నాడు నిర్వేదంగా.

అధికారి అంతా ఓపిగ్గా విని గాఢంగా నిట్టూర్చాడు. కొన్ని క్షణాలు దీర్ఘంగా ఆలోచించాడు.

"నిన్న వైర్లు తెగిపడటానికి కారణం నీకు తెలుసా?...ఎవరో అక్రమంగా కరెంటు వాడుకోవటానికి ప్రయత్నించారు. దానివలనే నీ పాక వద్ద స్తంభం మీద వైర్లు తెగికింద పడిపోయాయి....అంతేగాని వాటంతట అవి పడలేదు" అన్నాడు.

ఆయన మాటలు వినేటప్పటికి నరసయ్యకు తాను రోజూ సాయంకాలం కోళ్లషెడ్డు వద్ద తగిలించే వైర్లు గుర్తుకొచ్చాయి. వెనువెంటనే నిన్నటి సంఘటన గుర్తుకొచ్చింది. నిన్న తను ఇంట్లో వుంటే ఆయనే వైర్లు వేసినట్టు పెదనాయుడు చెప్పాడు. ఆ వెంటనే కరంటు పోయిందనీ అన్నాడు.

"తమరన్నది నిజమేనండి బాబయ్య! దొంగ వైర్లు యేసింది మా యజమాని పెదనాయుడేనండి. ఆయనేత్తేనే నిన్న అలా అయిందంట. కరంటు పోయిందని సాయంగా ఆయనే నాతో సెప్పాడండి" అన్నాడు అసలు సంగతి బయటపెడ్తూ.

ఆ మాటలు విన్న అధికారి ఆశ్చర్యపోయాడు.

నరసయ్యను అక్కడే వుండమని, తను పెదనాయుడు వద్దకెళ్లాడు.

నిన్న మీరు వైర్లు వేసి విద్యుత్తు అక్రమంగా వాడుకోవటానికి ప్రయత్నించటం వలనే తీగలు తెగిపోయని మా తనిఖీలో తేలింది. మీ మీద కేసు పెట్టాల్సివస్తుంది" అన్నాడు హెచ్చరికగా. విషయాన్ని పెదనాయుడు పసిగట్టేసాడు.

"క్షమించండి సార్! మా పనివాడు ఏదో తెలియక వేసాడు...వాణ్ని మందలిస్తాను. ఇంకెప్పుడూ ఇలా జరగదు" అన్నాడు పెదనాయుడు అభినయిస్తూ.

అధికారి ఖంగుతిన్నాడు అతని మాటలకు, సమయస్ఫూర్తికి. 'ఆహా! ఎంత తెలివి ప్రదర్శించాడు' అనుకున్నాడు మనసులో.

"మీరు అబద్ధం చెబుతున్నారు" అన్నాడు అధికారి రెట్టిస్తూ.

"లేదండీ బాబు!...కావాలంటే మా నర్సిగాణ్ని అడగండి"బుకాయించాడు పెద నాయుడు. అంతా తిప్పి పనివాడిమీదకే నెట్టేస్తున్నాడని అధికారికి అర్థమై పోయింది. వెంటనే ఆఫీసుకి తిరిగి వెళ్లిపోయాడు.

"నరసయ్యా! మీ యజమాని నెపమంతా నీ మీదకు నెట్టేసాడు... నువ్వు తెలియక వైరేసావన్నాడు" అన్నాడు అధికారి.

"అయ బాబోయ్! అంత మాటన్నాడండీ!" పిడుగు పడినట్టు అదిరిపడ్డాడు నరసయ్య.

అధికారి కొంతసేపు ఆలోచించాడు.

ఒకటే పరిష్కారం. కోళ్ల ఫారం మీద నువ్వు ఫిర్యాదు చేస్తే నీకు తప్పక పరిహారం లభిస్తుంది. అన్నాడు ఆఖరిగా...అనేసి సిబ్బందితో కలిసి జీపు ఎక్కి వెళ్లిపోయాడు.

నరసయ్యకు దిక్కుతోచక తల పట్టుకున్నాడు. "ఆయన సేసిన తప్పును నా మీదకు తోసేసాడు. ఆయన బాగుని నేను కోరుకుంటే నాకు మాత్రం మాటసాయం కూడా సేయలేక పోయాడు... పెసిడెంటేమో రాజకీయం అడ్డం ఎట్టుకొని సిన్న సంతకం ఎట్టలేకపోయాడు. పెదనాయుడేమో తనమీద నేరం లేకుండా తప్పించుకున్నాడు. ఏం మనుసులు ఈళ్లు!... ఇప్పుడేం సేయాలి నేను?...అటు సిన్న ఆదారం గేది పోయింది. దాని పరేరం కోసం నెలకింతని యిచ్చి నాకు కూడెడుతున్న నా యజాని మీద పిరియాదు సేసి వున్న ఈ ఆధారం పోగొట్టుకోవాలా?...లేక ఈ నవుక్రీ కోసం ఆ గేది నట్టపరేరం నాలుగేలు వొదులు కోవాలా? నాకేదీ దారి?... అది కావాలనుకొంటే దాన్నొదులుకోవాలి. ఇది కావాలనుకొంటే దాన్నొదులు కోవాలి...ఈళ్లందరి మద్దెన తనలాంటి బడుగోళ్లే అన్యాయానికి బలయ్యేది!"

బరువెక్కిన గుండెతో నరసయ్య ఇంటికి తిరుగు ముఖం పట్టాడు.

మర్నాడు గేదె కళేబరం కటిక వాని దగ్గరకెళ్లింది! నరసయ్య కోళ్లఫారానికెళ్లాడు!!